ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



5 జయశంకర్ భూపాలపల్లి

గురువారం 24 జూలై 2025

ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ప్రాణ నష్టం జరగకుండా చూడాలి
- జలపాతాల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, జూలై 23(ఆంధ్రజ్యోతి): వరద ముప్పును ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని జిల్లా అధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆమె బుధవారం సమావేశమయ్యారు. వరదలపై సమీక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో వాగులు పొంగి పొర్లుతుండడంతో పర్యాటకులు జలపాతాల వద్దకు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో వందల కిలోమీటర్ల మేర గోదావరి పరీవాహక ప్రాంతం ఉందని, ఇతర రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిస్తే ఆ నీరు ఇక్కడి ప్రాంతం నుంచి తరలిపోతూ గ్రామాలను ముంచేస్తుందని అన్నారు. 1986లో చోటుచేసుకున్న సంఘటన భయాందోళనకు గురిచేసిందని గుర్తు చేశారు. 2022, 2023లోనూ పలు సంఘటనలు అతలాకులం చేశాయన్నారు. టర్నాడో వల్ల లక్షలాది వృక్షాలు నేలకొరిగాయని అన్నారు. అలాంటి సుడిగాలి గ్రామాలపైకి వస్తే ఎలాంటి నష్టం వాటిళ్లుతుందోనని ఊహించుకోవడం కూడా కష్టంగా ఉందన్నారు. గోదావరి నీరు గ్రామాల్లోకి రాకుండా ఏటూరునాగారం, మంగపేట మండలాల సమీపంలో కరకట్ట నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో నిరంతరం వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో పాఠశాలలు మూసివేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. అత్యవసర సమయాల్లో వాడుకునేందుకు కలెక్టర్లకు సీఎం ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. రాష్ట్రంలోనే ములుగు జిల్లాను వాతావరణ శాఖ అధికారులు రెడ్ జోన్‌గా ప్రకటించారని తెలిపారు. ఈ నెల 27న భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రభుత్వ ఉద్యోగులు సెలవులపై వెళ్లకూడదని కోరారు.

కలెక్టర్ దివాకర మాట్లాడుతూ వరద ముప్పును ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. ముందుగా నాలుగు బోట్లను ఏర్పాటు చేయడంతో పాటు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌టీఆర్‌ఎఫ్, బృందాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లాలో 800కు పైగా చెరువులు ఉన్నాయని, వాటిలో నీరు ప్రస్తుతం నిలకడగా ఉందన్నారు. లోతట్టు గ్రామాల్లో గర్భిణులను ఆస్పత్రులకు తరలించామన్నారు. ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడానికి అన్ని ఏర్పాటు చేశామన్నారు.ఎస్పీ శబరీశ్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా జిల్లాలోని 11 స్థలాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు చేశామని అన్నారు.

ఎడతెరిపిలేని వాన



మంగపేట మండలం మల్లూరులో ఇంట్లోకి చేరిన వరద నీరు



కాటారం మండలంలో పత్తి చేనులో నిలిచిన వరదనీరు

- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షం
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- పలు రహదారుల వద్ద నిలిచిపోయిన రాకపోకలు
- కుంగిపోయిన తాత్కాలిక మట్టి రోడ్లు
- ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు
- నీటి మునిగిన పత్తి పంట



తాడ్వాయి మండలంలో గర్భిణిని వాగు దాటిస్తున్న బంధువులు

ములుగు, జూలై 23(ఆంధ్రజ్యోతి) : రెం డు రోజు లుగా ములుగు జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపిలేకుండా వర్షాలుకురు స్తున్నాయి. దీంతో గోదావరి, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహి స్తున్నాయి. కన్నాయిగూ డెం మం డలంలోని ఐలాపురం, కంతనపల్లి, బంగారుపల్లి గ్రామాలల మధ్యలో ఉన్న వాగులు ఒర్రెలు ఉప్పొంగాయి. ఏటూరునాగారం, తుపాకులగూడెం వెంటున్న దొంగలగుట్ట వాగు ఉధృతంగా ప్రవహించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బం దులు పడ్డారు. దొంగలగుట్ట ఒర్రె వద్ద అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. వర్ష ప్రభావంతో విద్యుత్‌కు అతరాయం ఏర్పడి మంగళవారం రాత్రి నుంచి మండలంలోని అన్ని గ్రామాలు చీకట్లో గడపాల్సి వచ్చింది. వాజేడు మండలంలో కొప్పునూరు గుండ్లవాగు ప్రాజెక్టు నుంచి భారీగా వరదనీరు వెంకటాపురం ప్రధాన రహదారిపైకి రావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాజేడు-జగన్నాథపురం మార్గమధ్యలో చెరువుకట్టలు తెగడంతో రోడ్డుపైకి వర్షపు నీరు చేరింది. పలు చోట్ల పంట పొలాలు నీటమునిగాయి. వాజేడు మండలంలో పిడుగుపాటుకు వేణు అనే యువకుడు మృతి చెందాడు. మంగపేట మండలంలో వర్షప్రభావంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మల్లూరులోని అత్తాపూర్ చెరువు తూముకు మరమ్మతులు సరిగా చేయకపోవడంతో లీకేజై నీరు నివాస ప్రాంతాల్లోకి చేరింది. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారిని మల్లూరులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. గంపోనుగూడెంలో ప్రధాన రహదారి కోతకు గురైంది. మంగపేట-బోరునర్సాపురం మధ్యలో కొత్త బ్రిడ్జి వద్ద బుంగపడింది. మల్లూరు సమీపంలో రోడ్డుపై బుంగ పడింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. మండలంలో విద్యుత్ అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏటూరునాగారం మండలంలో పలు గ్రామాలు జలమయమయ్యాయి. ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లో జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. మల్యాల, కొండాయి, గోవిందు రాజులకాలనీ, ఐలాపురం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచాయి.



టేకుమట్ల మండలం భూర్నపల్లిలో చలివాగులో తెగిపోయిన తాత్కలిక రోడ్డు

భూపాలపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా అంతటా మంగళవారం రాత్రి నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వాన కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లోని వాగుల సమీపంలో పత్తి పంటలు నీటమునిగాయి. దీంతో రైతులకు నష్టం వాటిల్లింది. మరో వైపు భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఉపరితలబొగ్గు గనుల్లో (ఓపెన్‌కాస్టు) వర్షపు నీరు చేరడంతో ఉత్పత్తి నిలిచిపోయింది. మరో వైపు టేకుమట్ల మండలంలో రాత్రి నుంచి బుధవారం ఉదయం పది గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా మానేరు, చలివాగుల్లో నిర్మించిన తాత్కాలిక మట్టి రోడ్లు వరద తాకిడికి కొట్టుకుపోయాయి. దీంతో జమ్మికుంట, పరకాల, భూపాలపల్లి వైపు రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలోనే అత్యధికంగా టేకుమట్ల మండలంలో 9.82 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. బుధవారం సాయంత్రం వరకు కూడా ఇంకా కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు వచ్చి చేరుతోంది.

ఉప్పొంగిన బొగత



వాజేడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం ఉప్పొంగింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు ఏకదాటిగా కురుస్తున్న భారీ వర్షానికి వరద నీరు పోటెత్తుతోంది. కొండలు, గుట్టల నుంచి ఒక్కసారిగా నీటి ఉధృతి పెరగటంతో జలధారలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. బుధవారం ఉదయం 10.30 గంటల వరకు మామూలుగా ఉన్న జలపాతం 11. గంటల తర్వాత హోరెత్తింది. దీంతో చుట్టూ ఉన్న రక్షణ కంచె, ట్రీహౌజ్, మరుగుదొడ్లు మునిగిపోయాయి. దీంతో జలపాతం సందర్శనను అటవీ శాఖ అధికారులు నిలిపివేశారు.

పిడుగుపాటు గురై యువకుడి మృతి



వేణు(ఫైల్)

వాజేడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గురై యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై జక్కుల సతీష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడు మండలంలోని

(మిగతా 8వ పేజీలో)

విచారణ అయిపాయే.. నివేదిక ఏమాయే..?!

- కేయూలో అవినీతి, అక్రమాలపై చర్యలేవి?
- మాజీ వీసీ రమేష్‌పై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణ
- మాజీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అర్హతలపై ఎంక్వైరీ అటకెక్కినట్టేనా?
- నిబంధనలు పాటించలేదని మాజీ వీసీ వెంకటరత్నంపై ఆరా
- ఏళ్లు గడుస్తున్నా నివేదికలు ఏమయ్యాయో తెలియని వైనం
- వెంటనే బహిర్గతం చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్
- వర్సిటీ ప్రక్షాళనపై వీసీ దృష్టిపెట్టాలని విద్యార్థుల విజ్ఞప్తి



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయ యూనివర్సిటీ ప్రక్షాళన అటకెక్కింది. యూనివర్సిటీ భూముల ఆక్రమణలు, నిధులు దుర్వినియోగం, అక్రమ నియామకాలపై వేసిన విచారణ కమిటీల నివేదికలు మాయమయ్యాయి. మాజీ వీసీలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చేపట్టిన విచారణ ఏమైందో తెలియడం లేదు. మాజీ వీసీ రమేష్ హయాంలో వచ్చిన అనేక ఆక్రమాలు, అవినీతిపై ఆరోపణలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టినప్పటికీ, వాటి నివేదికల ఆధారంగా చర్యలు తీసుకోకపోవటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే విద్యార్హతలపై గత రిజిస్ట్రార్‌పై విచారణకు జారీచేసిన ఆదేశాలు ఎటు వెళ్లాయనేది ప్రశ్నార్థకంగా మారాయి. గత వీసీ హయాంలో జరిగిన ఆక్రమాలు, అవినీతిపై దృష్టి సారిస్తూనే.. నేటితరానికి ఉపాధి అవకాశాలు కల్పించే కొత్త కోర్సులను యూనివర్సిటీ పరిధిలో ఏర్పాటు చేసేలా అధికారులు దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు.

విజిలెన్స్ విచారణ అటకెక్కినట్టేనా..?

కాకతీయ యూనివర్సిటీ భూముల అక్రమణలతో పాటు అధ్యాపకుల నియామకాల్లో ఆక్రమాలు, అవినీతిపై వేసిన విజిలెన్స్ విచారణలు మౌనం రాగం ఆలపిస్తున్నాయి. మే 2021లో కేయూ వైస్‌చాన్స్‌లర్‌గా తాటికొండ రమేష్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పలు వివాదాలు చుట్టుముట్టాయి. ప్రధానంగా నిబంధనలకు విరుద్ధంగా సీనియర్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారనే ఆరోపణలు వచ్చాయి. తన హయాంలో ఎలాంటి అనుమతులు లేకుండా 16మందిని అనుబంధ అధ్యాపకులుగా నియమించటంపై వివాదం ఏర్పడింది. వీటితో పాటు కేయూ పరిధిలో మొత్తం 24ఫార్మసీ కాలేజీలు ఉన్నాయి. అయితే 2023-24 విద్యాసంవత్సరంలో 12 కాలేజీలు డీఫార్మసీ కోర్సును ప్రవేశపెట్టేందుకు అనుమతులు కోరుతూ యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకోగా, వీటిలో ఆరు ఫార్మసీ కాలేజీలకు మాత్రమే అర్హత ఉండగా, మిగతా ఆరు కాలేజీలకు ఎలాంటి అనుబంధ వైద్యశాలలు లేకపోయినప్పటికీ యూనివర్సిటీ అనుమతులు ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. న్యాక్ గ్రేడింగ్ సమయంలో చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు చేసే విషయంలో అధికారులు కక్కుర్తిపడ్డారనే ఆరోపణలు వచ్చాయి. వీటితో పాటు యూనివర్సిటీ భూములు 12 ఎకరాల వరకు కబ్జాకు గురైనట్లుగా గుర్తించారు. కబ్జాకోరులను వీసీ రక్షిస్తున్నారనే ఆరోపణలను ఎదుర్కొన్నారు. అలాగే పీహెచ్‌డీ సీట్లు, కేయూలో సీడ్‌మనీ పేరుతో నకిలీ పరిశోధన ప్రాజెక్టులతో రూ.20లక్షలకు పైగా నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు వినిపించాయి. ఆరుగురు ప్రొఫెసర్లతో కలిసి సీడ్‌మనీ పేరుతో జరిగిన ఈ అక్రమాలపై విచారణ జరిపించాలని అప్పట్లో అకుట్ ఆందోళన చేపట్టింది. వీటన్నింటిపై సీఎం రేవంత్‌రెడ్డికి అకుట్ బృందం ఫిర్యాదులు చేసింది. దీంతో ప్రభుత్వం అప్పటి వీసీ రమేష్‌పై 2024 మే 18వ తేదీన

(మిగతా 8వ పేజీలో)

హామీలు నెరవేర్చకపోతే రాజీనామా చేయ్..

- సీఎంపై మంద కృష్ణ మాదిగ ఫైర్
- పింఛన్లు పెంచుతామని చెప్పి విస్మరించారనే ఆగ్రహం
- వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలను మోసగించారని నిప్పులు

ములుగు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచ కపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ సన్నాహక సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వృద్ధులు, వితంతులు, ఒంటరి మహిళలకు ఇచ్చే పింఛన్లను ఆగస్టులో పెంచకపోతే రేవంత్‌రెడ్డి రాజీమానా చేసే పరిస్థితులు ఉత్పన్నమవుతా యని హెచ్చరించారు. పంఛన్లు పెంచడమో, రాజీనామా చేయడమో తేల్చుకోవాల్సిన పరిస్థితి రాబోతుందని వ్యాఖ్యానించారు. దివ్యాంగులకు రూ. 4వేల నుంచి రూ. 6 వేలు పెంచుతామని, వృద్ధులు, వితంతువు లు, ఒంటరి మహిళలకు రూ. 2 వేల నుంచి రూ.4 వేలు పెంచుతా మని ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ఓట్లు దండుకున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు కావస్తున్నా నిమ్మకునీరెత్తినట్టు వ్యవ హరిస్తూ మోసం చేస్తోందని మండిపడ్డారు. పెంచాల్సిన ప్రభుత్వం పెంచకపోవడంతో అడగాల్సిన వారు అడగడంలేదని ప్రతిపక్షాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు 'చలో హైదరాబాద్'కు పిలుపునిచ్చామన్నారు. ఆగస్టు 13న జరగనున్న బహిరంగ సభకు పెన్షన్ దారులు స్వచ్ఛందంగా భారీ ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ సభలో ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి పైడి మాదిగ, జిల్లా అధ్యక్షుడు శ్యాం మాదిగ, నాయకులు రమేష్ మాదిగ, విజయ్ మాదిగ పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ సన్నాహక సభలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఉచిత ప్రయాణం.. చారిత్రకం

మహాలక్ష్మి సంబరాల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

కృష్ణకాలనీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం ఒక చారిత్రకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి బస్టాండ్ ఆవరణలో బుధవారం జరిగిన మహాలక్ష్మి సంబరాల్లో ఆయన మాట్లాడారు. ఈ పథకంలో 200 కోట్ల ప్రయాణాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూపాలపల్లి డిపో పరిధిలో ఉచిత బస్సు సౌకర్యాన్ని 1.44 లక్షల మంది మహిళలు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. దీంతో వీరిపై రూ.73.83 లక్షల చార్జీల భారం తగ్గిందని, ఆ మొత్తాన్ని అంతా ప్రభుత్వమే భరిస్తోందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ మహాలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారని అన్నారు. మహిళలకు ఇందిరా శక్తి పథకంలో భాగంగా కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తోడ్పడుతోందని అన్నారు. మహిళా సంఘాలకు ప్రత్యేకంగా వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తున్నారని తెలిపారు. మహిళల స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం నిత్యం ఉచిత బస్సు సౌకర్యాన్ని ఉపయోగించుకొని ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న వారితో పాటు విద్యార్థినులను సత్కరించి జ్ఞాపికలను అందించారు. అలాగే, భూపాలపల్లి మండలంలోని దూదేకులపల్లి గ్రామానికి నూతన బస్సు సర్వీసును ప్రారంభించారు. ఆ బస్సులో భూపాలపల్లి బస్టాండ్ నుంచి కమలాపూర్ క్రాస్ వరకు ఎమ్మెల్యే స్వయంగా ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో భూ పాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, సీఐ నరేష్‌కుమార్, డిపో మేనేజర్ ఇందు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



భూపాలపల్లి మండలం దూదేకుపల్లి గ్రామానికి నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

VAAGDEVI COLLEGE OF ENGINEERING
Autonomous, Accredited by NAAC with 'A' Grade, JNTUH Affiliated Research Centre
Private Un-Aided Non-Minority, Approved by AICTE, New Delhi & Affiliated to JNTUH
Khammam Road, Bollikunta, Warangal-506 005, Telangana State
B.TECH - LATERAL ENTRY SPOT ADMISSIONS 2025-26
Elegible candidates can attend the Spot Admissions with all original certificates and necessary fee in the college premises on 26.07.2025 at 11:00 A.M. Admissions will be made as per the guidelines given by the Convenor, TSECET-2025.
Course: Civil | EEE | Mech | ECE | CSE | CSE(AI&ML) | CSE(DS)
Date: 24.07.2025 Sd/- Secretary & Correspondent
College Code : VAGE | Contact Nos: 8886536969, www.vaagdevi.edu.in

SVS GROUP OF INSTITUTIONS
(An Integrated Campus)
(UGC – AUTONOMOUS)
SPOT ADMISSIONS
ADMISSION NOTIFICATION for B.TECH LATERAL ENTRY (2ND YEAR)
(Non-Minority Institution)
Applications are invited from eligible candidates those who have not taken admission so far in direct II Year B. Tech under Lateral Entry scheme into the following courses for Academic Year: 2025-2026

Course	CSE	CSE (AI & ML)	CSE (Data Science)	ECE	EEE

Application form & Other details can be obtained from the college/website (www.svsit.ac.in).Filled in application form along with copies of relevant certificates and prescribed fee shall be submitted on or before 25-07-2025 at college office by 5.00 PM with application fee of Rs. 500/-.
SPOT Admission will be conducted on 26-07-2025 at College Premises.
* TG Govt. Fee Reimbursement is not available for SPOT Admissions Quota*
TGECET-2025 Counseling Code: SVSE (Engineering)
College Tuition Fee: Rs. 65,000/- (for B.Tech)
These admissions will be made as per guidelines of CONVENOR, TGECET-2025 / SECRETARY TGCHE
**Note: Applications are invited from 24-07-2025 to 25-07-2025
Date: 23-07-2025. Sd/- SECRETARY

JAYAMUKHI
INSTITUTE OF TECHNOLOGICAL SCIENCES
(AUTONOMOUS)
Affiliated to JNTUH & Accredited with NAAC "A" Grade
NARSAMPET, WARANGAL - 506332 Ph: 8897971169, 9398077432 www.jits.in
Spot Admissions for B.Tech II Year (Lateral Entry)
Applications are invited from the candidates who have qualified in TGECET-2025 or passed Diploma/B.Sc. with percentage as prescribed by TGECET-2025(ADMNS) and not taken admission anywhere, on or before 25-07-2025 for the vacancies IN B.TECH(L.E) CSE,CSM, CSD,CSI,CIV,MEC,EEE,ECE. The spot admissions will be conducted on 26-07-2025. The selected candidates have to pay tuition fee and admission fee as prescribed by college and they have to submit all the originals. The admissions will be conducted as per guidelines issued by the Convenor, TGECET(ADMNS). Few vacancies are available.
Sd/- PRINCIPAL

Economy Classified Display COLOUR CLASSIFIED DISPLAY
ఆంధ్రజ్యోతి లో ప్రకటన ఇవ్వండి - అధిక ప్రచారం పొందండి
బ్లాక్ & వైట్ స్కేర్ సెం.మీ. Rs.170/-
ప్రతి మంగళ వారం & శుక్ర వారం కలర్ స్కేర్ సెం.మీ. Rs. 220/-
సింగిల్ మరియు డబుల్ కాలమ్స్ మాత్రమే...
వివరాలకు సంప్రదించగలరు
హన్మకొండ : 9985411677,
వరంగల్ : 9985406150, 9985408173
జనగామ : 9866431354, మహబూబాబాద్ : 9985418040
తొర్రూరు : 9985408003 జయశంకర్ : 9985401232

పంటలను కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే

● స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
● ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

ధర్మసాగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలను కాపాడే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియ శ్రీహరి అన్నారు. బుధవారం ధర్మసాగర్ రిజర్వార్ దక్షిణ కాలువ ద్వారా పంట పొలాలకు సాగునీటిని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుతో కలిసి దక్షిణ, ఉత్తర కెనాల్‌కు సాగునీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సాగునీటిని విడుదల చేశామన్నారు. దక్షిణ కెనాల్ కింద 12 డిస్టిబ్యూటరీల ద్వారా ఒక లక్ష అరువేల ఎకరాలకు సాగునీరు అందనున్నట్లు తెలిపారు. ఈ కెనాల్ ద్వారా ధర్మసాగర్, ఐనవోలు, జఫర్‌గడ్, హసన్‌పర్తి మండలాలకు సాగునీరు అందుతుందన్నారు. రైతులు నారు పోసుకొని వర్షాల కోసం ఎదురుచూస్తున్న క్రమంలో నాట్లు వేసుకునేలా గోదావరి నదీజలాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఆన్, ఆఫ్ పద్ధతి ద్వారా పది రోజులు నీటిని విడుదల చేసి, మరో పది రోజులు నీటిని ఆపనున్నట్లు ఆయన తెలిపారు. ఐనవోలు, జఫర్‌గడ్ మండలాల చివరి గ్రామాలకు కూడా సాగునీరు అందే విధంగా నీటిని విడుదల చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నీటి దుర్వినియోగం చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులకు కడియం సూచించారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. అనునిత్యం రైతుల కోసం, రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పరితపిస్తోందన్నారు. నీటి విడుదల కోసం ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి అనుమతిని తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ హయాంలోనే దేవాదుల ప్రాజెక్టును నిర్మించామని అన్నారు. కొందరు బీఆర్‌ఎస్ నాయకులు అవాకులు చెవాకులు పేలుతూ రైతుల పట్ల కపట ప్రేమను చూపిస్తున్నారని,వారి మాటలను నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, మార్కెట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రసాద్, నర్సింహారెడ్డి, రాంరెడ్డి, రమేష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాద కుమారస్వామి, రాజు, పెద్ది శ్రీనివాస్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ధర్మసాగర్ రిజర్వాయర్ దక్షణ కాలువకు సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నాగరాజు



రఘునాథపల్లిలోఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న కలెక్టర్

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

రఘునాథపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు సరిపోయే యూరియా నిల్వలు ఉన్నాయని, అనవసరంగా ఫర్టిలైజర్ షాపుల యాజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో రిజిస్టర్లు పరిశీలించారు. క్లాస్‌రూంలకు వెళ్లి విద్యార్థులతో పలు అంశాలపై మాట్లాడారు. అలాగే మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించారు. తాజా కూరగాయలు, శుభ్రమైన నీటితోనే వంట చేయాలని సూచించారు. అనంతరం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించారు. సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో భోజన్న, డీఏవో రామారావు నాయక్, ఏవో కె.శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ ఫణి కిషోర్, ఎంపీడీవో శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సరిత మృతి పార్టీకి తీరని లోటు

మాజీ మంత్రి హరీష్‌రావు



సరిత చిత్రపటం వద్ద సంతాపం తెలుపుతున్న హరీష్‌రావు

వేలేరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మాజీ జడ్పీటీసీ చాడ సరిత (48) మృతి పార్టీకి తీరనిలోటని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. బుధవారం వేలేరు మండలం మల్లికుదుర్లలో సరిత దశదిన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆయన విచ్చేసి సరిత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జడ్పీటీసీగా మండలానికి, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారని కొనియాడారు. చిన్న వయస్సులో సరిత చనిపోవడం బాధా కరమన్నారు. సరిత కుటుంబాన్ని అన్ని విధాలుగా అందుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ రాజయ్య, వినయ్‌భాస్కర్, ధర్మారెడ్డి, శంకర్ నాయక్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సుధీర్ కుమార్, రాకేష్‌రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 1 నుంచి ఆధార్ బేస్డ్ అటెండెన్స్

వరంగల్ మెడికల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలోని అన్ని విభాగాల్లో ఆగస్టు 1వ తేదీ నుంచి ఆధార్ బేస్డ్ అటెండెన్స్‌ను అమలు చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తూ ప్రభుత్వ మెమో నెంబరు 1807/ఎఫ్/2025ని విడుదల చేశారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్, వైద్య విద్య సంచాలకుడు, ప్రజారోగ్య సంచాలకుడు, ఆయూష్ విభాగంలోని అన్ని ఆస్పత్రులలో ఆగస్టు 1 నుంచి అమలు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు విభాగాల అధిపతులు తగిన చర్యలు తీసుకోనున్నారు.

బిల్లులు చెల్లించని సర్వీసులపై దృష్టి సారించాలి

సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

రాంనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులు చెల్లించని సర్వీసులపై నోడల్ జీఎంలు దృష్టి సారించి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో డైరెక్టర్లు, సీఈలు, నోడల్ జీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. కాలిపోయిన, పనిచేయని మీటర్లను వెంటనే మార్చాలన్నారు. హెచ్‌టీ సర్వీసులను తనిఖీ చేయాలన్నారు. రెండేళ్లపైబడిన వర్క్ ఆర్డర్స్ పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ సర్వీసులు పెండింగ్ లేకుండా రిలీజ్ వేగవంతం చేయాలన్నారు. కొత్త సబ్‌స్టేషన్ పనులను విధిగా తనిఖీలు చేయాలని క్వాలిటీ కంట్రోల్ వింగ్‌ను ఆదేశించారు. రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్ పనులు, ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్ పనుల పురోగతిపై ఆరా తీస్తూ వేగంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. భారీవర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి అంతరాయాలు ఏర్పడిన వెంటనే పునరుద్ధరణ చేసేలా మెన్, మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. 16 సర్కిళ్ల పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్‌కు కొత్త ఎస్పీఎం షెడ్లను ఏర్పాటు చేశామని, ఇక నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. సమావేశంలో డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, మధుసూదన్, మోహన్‌రావు, ప్రభాకర్, సీఈలు సదర్‌లాల్, అశోక్‌కుమార్, తిరుమల్‌రావు, రాజుచౌహాన్, అశోక్, రవీంద్రనాథ్, ఆర్.చరణ్‌దాసు, వెంకటరమణ, మాధవరావు, జాయింట్ సెక్రటరీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

మహిళల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

మహాలక్ష్మి సంబరాల్లో పాల్గొన్న మంత్రి సీతక్క



ములుగు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల పక్షపాతి అని, అందుకే వారి అభ్యున్నతికి అనేక పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో మహాలక్ష్మి సంబరాలు నిర్వహించగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్న మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసిందన్నారు. మహిళలు ఇప్పటి వరకు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారని, దీంతో వారికి రూ.6,700 కోట్లు ఆదా అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, ఆర్ఎం విజయభాస్కర్ తదితరులు పాలల్గొన్నారు.

ఏజెన్సీకి ఆర్టీసీ బస్సు పునప్రారంభం..

బయ్యారం(మహబూబాబాద్ జిల్లా), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : బయ్యారం ఏజెన్సీ ప్రాంతానికి ఆర్టీసీ బస్సు సర్వీస్ పునప్రారంభమైంది. గతంలో కొంత కాలం పాటు మహబూబాబాద్ బయ్యారం రామగుండాల మీదిగా ఇల్లెందు పట్టణానికి బస్సు సర్వీస్ నడిపారు. అనంతరం ఏమైందో ఏమో తెలియదు కాని సర్వీసును రద్దు చేసిన ఆర్టీసీ తిరిగి బుధవారం పునప్రారంభించింది. దీంతో ఏజెన్సీ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నిందితులను చూపిస్తున్న వరంగల్ ఏసీపీ శుభం, సీఐ షూకూర్

రూ.9 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ఒడిషా రాష్ట్రానికి చెందిన ఇద్దరి అరెస్టు

వరంగల్ టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో ఇంతేజార్‌గంజ్ పోలీసులు భారీ స్థాయిలో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ శుభం, సీఐ మహ్మద్ అబ్దుల్ షూకూర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిషా రాష్ట్రంలోని గజపతి జిల్లా కట్టంగుమా గ్రామానికి చెందిన జులియం బెహరా(60), జులియం కుమారి బెహరా(55) అనే దంపతులు సుమారు 18 కిలోల ఎండు గంజాయిని తీసుకొని సోలాపూర్‌కు వెళ్లేందుకు టికెట్ లేకుండా రైలెక్కారు. వరంగల్ రైల్వేస్టేషన్ వద్దకు రాగానే టీటీ రావడంతో రైలు దిగారు. తిరిగి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో వెళదామని నిర్ణయించుకున్నారు. దానికి సమయం ఉండటంతో స్టేషన్ బయటికి వచ్చారు. అదేసమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులను చూసి పరుగెత్తుతుండగా వారిని పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.9లక్షల విలువ గల 18 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, తేజ, ఏఎస్‌ఐ భిక్షపతి, సిబ్బందిని ఏసీపీ శుభం, సీఐ షూకూర్ అభినందించారు.

మత్తడి పోస్తున్న పెద్ద చెరువు అలుగు



మత్తడి పోస్తున్న పెద్ద చెరువు అలుగు

బయ్యారం (మహబూబాబాద్ జిల్లా), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకే తలమానికమైన కాకతీయుల నాటి బయ్యారం పెద్ద చెరువు అలుగు మత్తడి పోస్తుంది. బుధవారం నాటికి 16.2 అడుగుల పూర్తి సామర్థ్యంతో చెరువు నిండటంతో మత్తడి దుంకుతుంది. వర్షం తగ్గుముకం పట్టకపోవడం, పందిపంపుల, మసివాగుల గుండా వరద ఉధృతి అధికంగా ఉండటంతో చెరువులోకి భారీగా నీరు వచ్చి చేరే అవకాశముంది. కాగా, చెరువు అలుగు పోస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ సాగు పనులు ముమ్మరం చేశారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి గల్లంతు

● బూరుగు గుంపులో ఘటన



నరేష్ (ఫైల్)

కొత్తగూడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు వాగులో గల్లంతయ్యాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బూరుగుగుంపులో బుధవారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలుకు కొత్తగూడ మండలంలోని వాగులు పొంగుతున్నాయి. ఈ క్రమంలో బూరుగుగుంపు గ్రామానికి చెందిన ఆగబోయిన వెంకటయ్య-పుల్లక్క దంపతుల కుమారుడు నరేష్ (30) భూర్కపల్లి వాగులో చేపలు పట్టేందుకు తోపెనతో వెళ్లాడు. వాగులో చేపలు పడుతూ నీటిలో కొట్టుకుపోయాడు. నరేష్ కొట్టుకుపోతుండగా చూసిన ఓ వ్యక్తి గ్రామస్థులకు సమాచారం ఇవ్వడంతో స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం పోలీసులకు, అధికారులకు గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ తిరుపతిరావు, తహసీల్దారు రాజు, సీఐ సూర్యప్రకాష్, ఎంపీడీవో రోజారాణి, ఎస్సై రవికుమార్ వాగువద్దకు చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఎస్పీ, రాజు మాట్లాడుతూ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ నయింనగర్‌లోని ఓ మాజీ ప్రజాప్రతినిధి నివాసంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. పరకాల కు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 54వ డివిజన్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి పరకాలకు చెందిన నలుగురు మాజీ ప్రజాప్రతినిధులు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు జరిపారు. ఇందులో పరకాలకు చెందిన నలుగురిని ఆదుపులోకి తీసుకొని రూ.17,070, నాలుగు సెల్‌ఫోన్ లను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): 8 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.25వేల జరిమానా చెల్లించాలని వరంగల్ జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయస్థానం కం రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి న్యాయమూర్తి మనిషా శ్రావన్ ఉన్నమ్ బుధవారం తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ.7లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా గీసుగొండ మండలానికి చెందిన వివాహిత.. తన 8 ఏళ్ల కూతురితో కలిసి జీవిస్తోంది. 2021 జూన్ 28న సాయంత్రం 5 గంటలకు ఊరిలోని వాటర్ ప్లాంట్ వద్దకు పాపను పంపించింది. కొద్ది సేపటికే తన కూతురు వాటర్‌ప్లాంట్ వద్ద ఏడుస్తోందని చెప్పడంతో ఆమె అక్కడికి వెళ్లింది.

ఏమైందని విచారించగా అదే గ్రామానికి చెందిన పసునూరి ఐలయ్య (62)పాపను తీసుకొనిపోతుండగా తాము చూశామని, తర్వాత పాప ఏడుస్తూ వచ్చిందని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై పాపను అడుగగా ఐలయ్య అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపింది. దీంతో పోలీసులకు తల్లి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన గీసుగొండ పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలుచేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి చనిపోయే వరకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.25వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ బొల్లం యుగంధర్ సాక్షులను ప్రవేశపెట్టగా లైజన్ అధికారిగా ఏఎస్‌ఐ కంతేటి హరికృష్ణ, భరోసా లీగల్ అడ్వయిజర్ సీహెచ్.నీరజ కేసులో సహకరించారు. దర్యాప్తు అధికారిగా అప్పటి ఏసీపీ ఎ.నరేష్‌కుమార్ వ్యవహరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బృందాదేవి గాయని కేసు వాదించారు.

భూ తగాదాల నేపథ్యంలో...

బావను హత్య చేసిన బావమరిది
గొర్రెలను కాసేందుకు వెళ్లిన బావను
ఇనుపరాడ్‌తో తలపై కొట్టి హత్య
కేసముద్రం మండలం ఉప్పరపల్లిలో ఘటన



హత్యాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో హత్యకు గురైన ఉప్పలయ్య(ఫైల్)

కేసముద్రం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : భూ తగాదాల నేపథ్యంలో కక్ష పెంచుకొని బావను బావమరిది హత్య చేసిన ఘటన కేసముద్రం మండలం ఉప్పరపల్లిలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కంకల ఉప్పలయ్య(50) గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ఉప్పలయ్యకు ఇదే గ్రామానికి చెందిన ఆయన బావమరిది కొనగొండ్ల మల్లేషంతో కొద్దిరోజులుగా భూమికి సంబంధించిన వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో గ్రామంలోని మసీదుకు సమీపంలో ఉప్పలయ్య తన గొర్రెలను కాస్తున్నాడు. ఆయనపై మల్లేషం ఇనుపరాడ్‌తో తలపై పలుమార్లు బలంగా కొట్టడంతో ఉప్పలయ్య అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. వెంటనే మల్లేషం అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటనపై పోలీసులకు సమాచారం అందడంతో ఘటన స్థలానికి వెళ్లి ఉప్పలయ్య మృతదేహాన్ని గుర్తించారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు, రూరల్ సీఐ సర్వయ్య ఘటన స్థలానికి చేరుకొని విచారణను సమీక్షించారు. మహబూబాబాద్ నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలను సేకరించారు. మృతునికి భార్య కోమల, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు రూరల్ సీఐ తెలిపారు. సొంత బావమరిదే బావను హత్య చేసిన ఘటన మండలంలో కలకలం రేపింది.

నల్లబెల్లం, పట్టిక స్వాధీనం

మహబూబాబాద్ రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం పరిధిలోని శనిగపురం శివారు రాంసింగ్‌తండాలో బుధవారం ఓ ఇంట్లో ఉన్న నిల్వ ఉన్న నాలుగు క్విం టాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. రాంసింగ్‌తండాకు చెందిన దారావత్ భీములు, బానోత్ రవీందర్ ఇద్దరు కలిసి గతకొద్ది రోజులుగా నల్లబెల్లం వ్యాపారం చేస్తున్నట్లు చెప్పారు. బాబునాయక్‌తండాకు చెందిన భూక్య అరుణ్‌వద్ద నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లం,50 కిలోల పటిక, 10 లీటర్ల గుడుంబాను కొనుగోలు చేసినట్లు చెప్పారు. వాటి విలువ సుమారు రూ.1.69 లక్షలు ఉంటుందన్నారు.దాడుల్లో ఏస్సై వెంకన్న, కానిస్టేబుళ్లు హుస్సేన్, రాజు, బాలరాజు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2432	1521
పల్లికాయ (సూక)	4350	3450
పల్లికాయ (పచ్చిది)	5050	1575
కందులు	6232	3022
పెసళ్లు	7052	3022
పత్తి	7800	5300
పసుపు (కాడి)	10333	9534
పసుపు (గోల)	9788	8700
తేజ మిర్చి	11000	8500
తేజ ఏసీ	13100	11500
వండర్‌హాట్	10000	6000
వండర్‌హాట్ ఏసీ	14000	11500
యూఎస్341ఏసీ	12800	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ఆంధ్రజ్యోతి Classifieds
Wanted Real Estate Health Jobs Beautician For Sale

WANTED
★ Wanted Teachers, to teach Pre-Primary, Primary Eng, 6th to 10th Eng, Social, Hindi, Maths, Wardens F/M, Tutors 4:00 pm to 7:00 pm, Wantchman Family, Bus Facility Available from Chinthal Brige AVSHS, Dharmaram, WGL. Cell.No : 9848672108, 9848181976.
AJW-6638

WANTED
★ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ మరియు టెలికాలర్స్ కావలెను. అర్హత : Any Degree సం॥ప్ర॥ 9052833550, 9504506666
AJW-540

WANTED
★ ప్రముఖ జిమ్ సెంటర్ (సుబేదారి) లో పని చేయుటకు Receptionist & Trainer (Male) కావలెను. Near by వారికి మొదటి ప్రాధాన్యత .Salary 10k. సెల్ :9052175676, 7396125034.
AJM-13760

WANTED
★ హస్పిటల్‌లో పని చేయుటకు PRO's ఆయాలు, స్విపర్స్ మరియు Beautician & Body Massage హన్మకొండ, కాకాజీ కాలనీ. సం॥ప్ర॥ 9989510003
AJW-243229

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
9985411677
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

HOUSE FOR SALE
★ H.No: 2-9-989, 150 Sq.yards, East Face Old House Near 100ft Road 2nd bit, Ambedkar Road 4th Bit for Sale Contact : 7799576977
AJW-243102

HOUSE FOR SALE
★ 32 లక్షలకే East Facing పక్కా రిజిస్ట్రేషన్ గల 113 Sq.Yds పాత గూన ఇల్లు-వరంగల్ మట్టివాడలోని రేకులపల్లి వాడలో 10ft. ఫ్యూచర్‌లో కట్టుకోవడానికి G+1 Municipal Construciton Permission కూడా ఉన్నది. బ్యాంకు లోన్‌కూడా వస్తుంది. సం॥ప్ర॥ 8331888842
AJW-243347

WATER PROOFING
★ బిల్డింగ్ లీకేజెస్, రూఫ్/స్లాబ్ లీకేజెస్, సైడ్ వాల్స్ (నిమ్ము), వాటర్ ట్యాంక్స్ మొదలగునవి వాటర్ ప్రూఫింగ్ రసాయనాల ద్వారా నివారింపబడును. 10 సం॥ గ్యారెంటీ SBI & ఇతర బ్యాంక్ ఉద్యోగులకు స్పెషల్ డిస్కౌంట్ ఇవ్వబడును. సం॥ప్ర॥ 7386961381.
AJW-243348

LOSS OF PASSPORT
★ I, CHIRANJEEVI AEKU, S/o. Keshavulu, H.No: 4-14/2, Parkal, Hanumakonda, T.G., Have Lost my Original Passport Bearing No: V2436246, While Travelling from Hanumakonda to Parkal. If Anybody found please contact : 9030210204
AJW-243101

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

3+2 స్కీం కలదు
ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

పారదర్శకంగా బొగ్గు విక్రయ విధానాలు

- కేంద్ర గనుల మంత్రి కిషన్ రెడ్డి
- లోక్‌సభలో ఎంపీ డాక్టర్ కావ్య ప్రశ్నకు వివరణ


లోక్‌సభలో ఎంపీ కడియం కావ్య

హనుమకొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో బొగ్గు ఉత్పత్తులపై కేంద్రం అనుసరిస్తున్న విధానాన్ని లోక్‌సభలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్నించారు. డాక్టర్ కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి వివరణ ఇచ్చారు. సింగరేణి బొగ్గుగనుల కంపెనీ లిమిటెడ్ బొగ్గు విక్రయ విధానాలను వివరించారు. సంస్థ అనుసరిస్తున్న విధానాలు పారదర్శకంగా ఉండడమే కాకుండా తెలంగాణలో పరిశ్రమ అభివృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారు. శక్తి విధానం (2017, 2025లో నవీకరణ), నాన్ రెగ్యులేటెడ్ సెక్టార్ లింకేజ్ వేలం విధానం (2026-2020లో సవరణ), న్యూ కోల్ డిస్ట్రిబ్యూషన్ పాలసీ (2007, 2022 సవరింపు) బ్రిడ్జి లింకేజ్ పాలసీ (2026) వంటి కేంద్ర బొగ్గు శాఖ విధానాల ప్రకారం సింగరేణి బొగ్గు గనుల కంపెనీ లిమిటెడ్ తన బొగ్గు సరఫరాను నిర్వర్తిస్తోందని మంత్రి వివరించారు. ఈ విధానాల అమలుతో పాదర్శకత, సమాన అవకాశాలు, పరిశ్రమలకు మద్దతు, ఉపాధి అవకాశాల పెరుగుదల, అలాగే రాయల్టీ, పన్నుల రూపంలో రాష్ట్రానికి భారీ ఆదాయం లభిస్తోందన్నారు. ఇది తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 2025లో సవరించిన శక్తి విధానం ఆధారంగా పవర్ రంగానికి కొత్త బొగ్గు లింకేజీలు మంజూరు చేయడమవుతోందని ఆయన తెలిపారు. ఈ విధానాల వల్ల తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలకు స్థిరమైన బొగ్గు సరఫరా లభించడంతో పాటు పోటీతత్వ ధరల ద్వారా వ్యాపార వ్యయాలు తగ్గుతుండటంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

పాఠశాలలకు
సంగీత వాయిద్య పరికరాలు

- త్వరలో విద్యార్థులకు శిక్షణ
- పీఎంశ్రీ కింద 15 పాఠశాలల ఎంపిక


విద్యార్థులకు అందించిన సంగీత వాయిద్య పరికరాలు

జనగామ కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు తమకు అభిరుచి ఉన్న కళారంగంలో కూడా రాణించడానికి పాఠశాల స్థాయి నుంచే వివిధ సంగీత కళలపై శిక్షణ ఇచ్చి వారు ఆశించిన రంగంలో స్థిరపడేలా విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. నూతన విద్యా విధానం-2020 ప్రకారం విద్యార్థులను ఇంటర్ తర్వాత వారు అన్ని రకాలుగా సాధికారత సాధించడానికి వివిధ వృత్తి విద్య అభ్యసనలతో పాటు సంగీత విద్య కూడా తోడ్పడుతుంది. అందుకనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పరిపూర్ణ అభ్యసనకు దోహదపడే అంశాలను వారికి అందుబాటులోకి తెచ్చి పాఠశాల విద్యను బలోపేతం చేస్తున్నాయి.

పీఎంశ్రీ కింద బడుల ఎంపిక

ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) యోజన పథకం ద్వారా రాష్ట్రంలో 832 బడులు ఎంపికయ్యాయి. జనగామ జిల్లా నుంచి 15 ఎంపిక కాగా, సంగీత తరగతులు నిర్వహించడానికి తొలి విడతలో 8 స్కూళ్లను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ మ్యూజిక్ క్లాసులు చెప్పించాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. వీటిలో నాలుగు స్కూళ్లకు వయోలిన్, తబలా, మృదంగం, హార్మోనియం మరో నాలుగు పాఠశాలలకు బ్యాండ్ సంగీత పరికరాలను అందించారు. పీఎంశ్రీ పథకం కింద ఎంపిక చేసిన ఒక్కో స్కూల్‌కు రూ.ఒక లక్ష చొప్పున అందనున్నాయి. ఈ మేరకు ఆరవ తరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు ఆసక్తి ఉన్న విద్యార్థులకు సంగీతాన్ని నేర్పించనున్నారు. వారానికి ఒక క్లాసు చొప్పున ఆయా పరికరాలతో శిక్షణ ఇప్పిస్తారు. త్వరలో సంగీత తరగతుల నిర్వహణపై ఎంపికైన పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లకు శిక్షణ ఇస్తారు.

ఎంపికైన స్కూళ్లు ఇవే..

సంగీత శిక్షణకు జనగామ జిల్లాలో 15 స్కూళ్లు ఎంపిక కాగా, తొలి విడతగా 8 స్కూళ్లకు సంగీత పరికరాలు అందజేశారు. అవి టీఎస్‌ఎంఎస్ స్టేషన్‌ఘన్‌పూర్, జడ్పీ హెచ్‌ఎస్ బచ్చన్నపేట, టీఎస్‌ఎంఎస్ చౌడారం, జడ్పీ హెచ్‌ఎస్ పాలకుర్తి, టీఎస్‌డబ్ల్యూఆర్ (బాలికలు) జఫర్‌గడ్, టీఎస్‌ఎంఎస్ నర్మెట, టీఎస్‌ఎంఎస్ కొడకండ్ల, జడ్పీహెచ్‌ఎస్ తరిగొప్పుల ఉన్నాయి.


డ్రెస్సులో బ్యాండ్ వాయిద్య పరికరాలతో విద్యార్థులు

సంగీత బోధనకు టీచర్లు

సంగీత పాఠాలు చెప్పే ఒక్కో స్కూల్‌కు ఒక టీచర్‌ను కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని అధికారులు భావిస్తున్నారు. దానికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు వచ్చిన తర్వాత జిల్లా అధికారులు రెగ్యులర్ పర్యవేక్షణతో సంగీత పాఠాలు నేర్పిస్తారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

బొమ్మనబోయిన శ్రీనివాస్, ఏఎంవో



చదువుతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో పట్టు సాధించాలి. సంగీత శిక్షణకు తొలి విడతగా జనగామలో 8 స్కూళ్లు ఎంపికయ్యాయి. వీటికి పూర్తి స్థాయి మార్గదర్శకాలు రాగానే ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తాం. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

శ్రీకరం.. శుభకరం..

- రేపటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- ఇంటింటా వ్రతాలు, ఊరూరా వన భోజనాలు
- నెల రోజుల పాటు దేవాలయాల్లో సందడి
- ఆలయాల్లో సామూహికంగా వరలక్ష్మి వ్రతాలు

వరంగల్ కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం అంటేనే పండుగలు, పర్వదినాలు, పూజలు, విందులు, వినోదాలు. ఆధ్యాత్మిక శోభతో అలరారే విధంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, వ్రతాలు నిర్వహిస్తారు. శివకేశవులకు, అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన మాసం. 30 రోజుల పాటు నిత్య పూజలు, ఆరాధనలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, దివ్యనామ సంకీర్తలతో ఆలయాలు సందడిగా మారుతాయి. వరలక్ష్మి అమ్మవారి వ్రతాన్ని ఈ మాసంలోనే నిర్వహిస్తారు. ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహిస్తారు.



ఆషాఢ మాసం అనంతరం వచ్చేది శ్రావణ మాసం. ఈ నెల 24న అమావాస్య అవుతున్నందున 25న శుక్రవారం నుంచి శ్రావణ మాసం ఆరంభం అవుతుంది. ఈ మాసంలో శివాలయాల్లో రుద్రాభిషేకాలు, విష్ణు ఆలయాల్లో ప్రత్యేక ఆరాధనలు, పూజలు, అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయి. అందుకే దేవతలకు ప్రీతికరమైన మాసంగా పేర్కొంటారు. శ్రావణం అంటే వ్రతాలకు నెలవు. వీటితో పాటు పండుగలు, పర్వదినాలు, వన భోజనాల సందడి నెలకొంటుంది. ముఖ్యంగా సత్యనారాయణ స్వామి వ్రతం, దత్తాత్రేయ స్వామి వ్రతాన్ని ఆచరించుకుంటారు. రాఖీపండుగ, జంజిరాల పున్నం ఈ నెలలోనే వస్తాయి. శ్రావణ వన భోజనాలకు ఇంటిల్లిపాది తరలివెళ్తారు. ఆలయాల్లో నిత్య రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, ఆరాధనలు, భజనలు, కుంకుమ పూజలు నిర్వహిస్తారు. మహిళలు భక్తిశ్రద్ధలతో నెలరోజుల పాటు నియమ నిష్ఠలతో పూజలు చేస్తారు. అమ్మవారి ఆశీర్వాదం కలుగాలని వరలక్ష్మి వ్రతాలను ఇంటింటా నిర్వహించుకుంటారు. ఇంటిలో సౌకర్యం లేని వారు ఆలయాల్లో నిర్వహించే సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో పాల్గొంటారు. ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తారు.

మహిళలకు వరం.. మహాలక్ష్మి పథకం..

- ఉచిత ప్రయాణంతో ఆలయాలకు ఆదాయం పెరిగింది
- వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లగలుగుతున్నారు..
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- వరంగల్ బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ సంబరాలు


ఆర్టీసీ 200 కోట్ల ఉచిత ప్రయాణాల సంబరాల్లో కేక్ కట్ చేస్తున్న మంత్రి కొండా సురేఖ

గిర్మాజిపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మహాలక్ష్మి పథకం మహిళలకు వరం లాంటిదని, పేదలు అనేక ప్రయోజనాలు పొందుతున్నారని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 200కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసిన సందర్భంగా బుధవారం వరంగల్ ఆర్‌టీసీ బస్‌స్టేషన్‌లో సంబరాలు జరుపుకున్నారు. హనుమకొండ డిపో మేనేజర్ ధరమ్‌సింగ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సంబరాల్లో మేయర్ గుండా సుధారాణి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి మంత్రి కొండా సురేఖ కేక్ కట్ చేసి మహిళలకు అభినందనలు తెలిపారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన మరుక్షణమే మహిళలకు ఆర్‌టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలుచేశారని గుర్తు చేశారు. ఈ సౌకర్యం వల్ల మహిళలు వైద్య సేవల కోసం హైదరాబాద్ వెళ్లి ఉస్మానియా, గాంధీ, నిమ్స్ తదితర ఆస్పత్రులలో ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారని అన్నారు. అదేవిధంగా ఆలయాల దర్శనం వల్ల రూ.176కోట్ల ఆదాయం పెరిగిందని అన్నారు. ఆర్‌టీసీ ఉచిత ప్రయాణం బుధవారం 23వతేదీ నాటికి 200కోట్ల ప్రయాణాలకు చేరుకుందని అన్నారు. ఉచిత ప్రయాణం వల్ల మహిళలు అమ్మనాన్న, అన్నదమ్ములు, అత్తమామల వద్దకు బాగోగులు చూసుకుంటున్నారని, వైద్యం కోసం పెద్దాస్పత్రులకు వెళుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటివరకు 15.43కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, తద్వారా రూ.690కోట్లు ఆదా చేసుకున్నారని మంత్రి సురేఖ అన్నారు. కేవలం వరంగల్ జిల్లాలోనే 4.54 కోట్ల మహిళలు ఉచితంగా ప్రయాణించి రూ.190కోట్లు ఆదా చేసుకున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 కోట్ల మంది మహిళలు రూ.6680 కోట్లు పొదుపు చేసుకున్నారని వివరించారు. ఉచిత ప్రయాణమే కాకుండా మహిళాసమాఖ్యలకు ఆర్‌టీసీ బస్సుల నిర్వహణను ప్రభుత్వం అప్పగించిందని గుర్తు చేశారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల కోసం వినూత్న పథకాలు, కార్యక్రమాలను అమలుచేస్తున్నారని అన్నారు. వరంగల్ మహిళా సమాఖ్యలకు కూడా ఆర్‌టీసీ బస్సుల నిర్వహణను అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

అనంతరం ఆర్టీసీ మహిళా సిబ్బంది, ప్రయాణికులతో పాటుగా వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీవో కౌసల్యా దేవి, ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం కె.భానుకిరణ్, తహసీల్దార్ ఇక్బాల్, వరంగల్ బస్‌స్టేషన్ మేనేజర్ గౌస్ మొహినుద్దీన్, టీపీసీసీ నాయకుడు మీసాల ప్రకాష్, మెప్మా సిబ్బంది, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన వివిధస్టాల్స్‌ను మంత్రి కొండా సురేఖ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

మార్కెట్‌లో లెక్క తేలని బస్తాలెన్నో?

- లాట్ ఐడీలు ఇచ్చిన మిర్చి బస్తాలు మాయం
- అధికారులు, దడువాయిలు, వ్యాపారుల కుమ్మక్కు
- మార్కెట్ ఆదాయానికి గండి



వరంగల్ వ్యవసాయం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఈ సీజన్‌లో అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలెన్నో లెక్క తేలడం లేదు. లాట్ ఐడీలు ఇచ్చినప్పటికీ వేలాది మిర్చి బస్తాల ఆచూకీ తెలియడం లేదు. కోట్లాది రూపాయల సరుకును ఎవరు.. ఎక్కడికి తీసుకు వెళ్లారు.. పన్ను రూపేణా రావాల్సిన లక్షలాది రూపాయల మార్కెట్ ఆదాయానికి గండి కొట్టిందెవరు.. అన్నది మార్కెట్ అధికారులు తేల్చాల్సి ఉంది.

మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన బస్తాలకు తొలుత మార్కెట్ సిబ్బంది లాట్ ఐడీలు ఇస్తారు. అందులో రైతు పేరు, ఊరు, ఏ రకం మిర్చి, ఎన్ని బస్తాలు, అడ్తిదారుడి పేరు తదితర పూర్తి సమాచారం ఉంటుంది. ఆ తరువాత ఖరీదుదారు కొనుగోలు చేస్తే దానికి సబంధించిన సమాచారం కూడా ఉంటుంది. ఒకవేళ రైతుకు ధర గిట్టుబాటు కాకపోతే తన బస్తాలను తీసుకెళ్లి కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుంటాడు. లేదా తిరిగి ఇంటికి తీసుకెళతాడు. ఇంటికి తిరిగి తీసుకుని పోవడం అన్నది వెయ్యిలో ఒకసారి జరుగుతుంది. మిర్చి బస్తాలను ఇంటి దగ్గర నిల్వ చేసే అవకాశం ఉండదు పాడైపోతుంది. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుంటారు.

మార్కెట్‌లో లాట్ ఐడీలు ఇచ్చిన తరువాత దానికి సబంధించిన బస్తాలు తిరిగి మార్కెట్ నుంచి బయటకు వెళ్లాలంటే సంబంధిత అడ్తిదారు ఆ బస్తాలను ఏ కోల్డ్ స్టోరేజీకి తీసుకువెళుతున్నాడో.. మార్కెట్ కమిటీ సిబ్బందికి సమాచారం అందించాలి. లాట్ ఐడీలను రద్దు చేయించుకోవాలి. కానీ ఎలాంటి సమాచారం లేకుండా వేలాది మిర్చి బస్తాలు బయటకు వెళ్లినట్లు తెలుస్తోంది. బయటకు వెళ్లిన ఆ మిర్చి బస్తాలు ఎక్కడ ఉన్నాయనేది మార్కెటింగ్‌శాఖాధికారులు తేల్చాల్సి ఉంది.

ఖమ్మంలో 4 లక్షల మిర్చి బస్తాలు మాయం

ఇటీవల ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో నాలుగు లక్షల బస్తాలకు లెక్క తేలకపోతే మార్కెట్ కార్యదర్శి అడ్తిదారులకు నోటీసులు జారీ చేశారు. ఏనుమాముల మార్కెట్‌లో లెక్కతేలని మిర్చి బస్తాలకు సంబంధించి మార్కెట్ అధికారులు ఇక్కడ అడ్తిదారులకు నోటీసులు ఇస్తారా..?.లెక్క తేల్చుతారా చూడాలి మరి.

మార్కెట్ ఆదాయానికి గండి..

మార్కెట్లో గిట్టుబాటు ధర పలుకనప్పుడు రైతులు తమ మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుంటారు. మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకుంటారు. తద్వారా మార్కెట్‌కు ఆదాయం వస్తుంది. అయితే ఇక్కడ అడ్తిదారు, దడువాయి, మార్కెట్ అధికారులు కుమ్మక్కై మార్కెట్‌కు పన్ను చెల్లించకుండానే సరుకును బయటకు తీసుకెళ్లారు. దీనివల్ల మార్కెట్ ఆదాయానికి కోట్లాది రూపాయలు గండి కొట్టారు. ఇప్పటికైనా మార్కెటింగ్‌శాఖ విజిలెన్స్ విభాగం ప్రత్యేక శ్రద్ధ కనబరిచి అక్రమాల వెనుక జరుగుతున్న తతంగాన్ని వెలికి తీయాల్సిన అవసరం ఉందని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

నేటి నుంచి రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

- ఆఫీసర్స్ క్లబ్ వేదికగా నాలుగు రోజుల పాటు క్రీడలు
- 20 జిల్లాల నుంచి 190 మంది క్రీడాకారుల హాజరు
- బ్యాడ్మింటన్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఏసీపీ జితేందర్‌రెడ్డి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : యోనెక్స్ సన్‌రైజ్ సహకారంతో మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీ నిర్వహించనున్నట్లు మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏసీపీ(ఎస్‌బీ) మూల జితేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జితేందర్‌రెడ్డి పాల్గొని బ్యాడ్మింటన్ క్రీడా పోటీల వివరాలను వెల్లడించారు.

ఈ నెల 24న క్రీడాకారుల సర్టిఫికెట్ల పరిశీలన, ఎంట్రీలు (క్వాలిఫైయింగ్ రౌండ్) 25న ఉదయం ఆఫీసర్స్ క్లబ్ వేదికగా ఏర్పాటు చేయనున్న క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌తో పాటు తెలంగాణ యూనివర్సిటీ వీసీ డాక్టర్ టి.యాదగిరిరావు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను లాంఛనంగా ప్రారంభిస్తారని జితేందర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో నాలుగు రోజుల పాటు ఆఫీసర్స్ క్లబ్‌తో పాటు ఎర్రగట్టు గుట్ట సమీపంలోని కిట్స్ కళాశాల ఇండోర్ స్టేడియంలో సింగిల్స్, డబుల్స్ మిక్స్‌డ్ డబుల్స్ బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న బ్యాడ్మింటన్ టోర్నీలో 20 జిల్లాల నుంచి సుమారు 190 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. అదే విధంగా ఈ నెల 27న ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేయనున్న క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అంతర్జాతీయ స్థాయి పూర్వపు బ్యాడ్మింటన్ క్రీడాకారులు శశిధర్ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తారని జితేందర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ నిబంధనల మేరకు క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత బస, భోజన వసతులను కల్పిస్తామన్నారు. ఇక్కడ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డిసెంబరు మాసంలో ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొమ్ము రాజేందర్, వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి, కోశాధికారి నాగ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంచాయతీ సేవలకు సుస్తీ..!

- కంప్యూటర్ సేవలన్నీ ఎంపీడీవో ఆఫీసుల్లోనే..
- తుప్పుపడుతున్న టీ-ఫైబర్ బాక్సులు
- ఇబ్బందులు పడుతున్న మారుమూల గ్రామాల ప్రజలు

వర్ధన్నపేట రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వేగంగా మరింత మెరుగ్గా అందించడానికి గత ప్రభుత్వం ఈ-పంచాయతీ విధానాన్ని ప్రవేశపెట్టింది. ధ్రువీకరణ పత్రాలను ఎక్కడికక్కడే అందించమే ముఖ్య ఉద్దేశంగా ఈ విధానాన్ని తీసుకువచ్చింది. తొలుత కొన్ని గ్రామ పంచాయతీలకు ఆపరేటర్లను నియమించి కంప్యూటర్లను అందించింది. మిగతా వాటికి కంప్యూటర్లు, ఆపరేటర్లు లేకపోవడంతో సేవలు అందడం లేదు. నియమించిన వారికే క్లస్టర్లుగా విభజించి సేవలు అందిస్తున్నామని ప్రస్తుతం అధికారులు చెబుతున్నారు. వరంగల్ జిల్లాలో 11 మండలాలు, 317 గ్రామాలకు గాను క్లస్టర్ల వారీగా 38 మంది కంప్యూటర్ ఆపరేటర్లను నియమించగా ప్రస్తుతం అందరూ ఎంపీడీవో ఆఫీసుల్లోనే పనిచేస్తున్నారు.

పంచాయతీకో టీ-ఫైబర్

ఈ-పంచాయతీ పాలన అమలు కావాలంటే కార్యాలయాల్లో కంప్యూటర్ సేవలు ఉండాలి. గత ప్రభుత్వం ఇంటింటికీ ఇంటర్‌నెట్ అందిస్తామని ప్రకటించి మిషన్ భగీరథ పైపులైన్‌తోనే టీ-ఫైబర్ లైను కోసం కేబుల్‌లను వేశారు. గ్రామ పంచాయతీ భవనాల్లో టీఫైబర్ సర్వర్ బాక్సులను ఏర్పాటు చేశారు. కానీ, అన్ని జీపీలకు కంప్యూటర్లను సరఫరా మాత్రం చేయలేదు. కొన్ని పంచాయతీలకు సరఫరా చేసినా వాటిని కూడా మండల పరిషత్ కార్యాలయాలకు తరలించి అక్కడి నుంచే పనిచేస్తున్నారు. చాలా చోట్ల వీరు గ్రామాల్లో కాకుండా ఎంపీడీవో కార్యాలయాల నుంచే పనిచేస్తున్నారు. గతంలో మండలానికో 2-3నుంచి మూడు క్లస్టర్లను ఏర్పాటు చేసి పెద్ద గ్రామ పంచాయతీల ద్వారా ఆపరేటర్లు కేటాయించిన పంచాయతీలకు వెళ్లేలా చేశారు. కానీ దానిని సైతం తొలగించి అన్ని మండలాల్లో ఎంపీడీవో కార్యాలయాల నుండే పనులు చక్కబెడుతున్నారు.


జీపీ భవనంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్లేట్లు

దీంతో మారుమూల గ్రామీణ ప్రజలు మండల కేంద్రానికి వచ్చి పనులు చేసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

సమస్త సమాచారం పొందుపర్చేలా..

ప్రతీ పంచాయతీకి అందించే ఈ-సేవలతో గ్రామాల్లో మెరుగైన పౌరసేవలు అందించేందుకు వీలవుతుందని ప్రభుత్వం భావించింది. పనులకు సంబంధించి నివేదికలు తయారు చేయడంతో పాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, వివాహాల నమోదు, జాబ్ కార్డుల జారీ, రేషన్ కార్డులు, పెన్షన్లు, వ్యక్తిగత మరుగుదొడ్ల కోసం దరఖాస్తుల స్వీకరణ, వృత్తి, వ్యాపార లైసెన్సుల మంజూరు ఇలా ఎన్నో సేవలను ఈ పంచాయతీల ద్వారా ప్రజలకు అందించాలి. దీనికి తోడు టాక్స్‌ల వసూళ్లు, పెన్షన్లు, వ్యక్తిగత సమాచారాలు, గ్రామ ప్రణాళికలు, అనుమతులు, గ్రామ సభల నిర్వహణ తదితర అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా పంచాయతీ నిర్వహణ మొత్తం పారదర్శకంగా ఉంటుందని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టింది. పల్లె ప్రగతి నివేదికలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పంచాయతీలకు అందించే నిధులు, వీటికి సంబంధించిన పనులు, ఖర్చులు, అన్ని వివరాలు కంప్యూటర్‌లో నమోదు చేయడం ద్వారా కచ్చితమైన సమాచారం ఉంటుందని భావించింది. ఇంటర్‌నెట్ సేవలతో సమయం ఆదాతో పాటు పనులు త్వరగా పూర్తవుతాయని తలచింది. గ్రామ పంచాయతీల ద్వారా ప్రజలకు ఇవి అందకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. అన్ని గ్రామ పంచాయతీలకు కంప్యూటర్లు సరఫరా చేసి, ఆపరేటర్లను నియమిస్తే ప్రజలకు మెరుగైన సేవలు సకాలంలో అందే అవకాశం ఉంది.

అందుబాటులోకి ఎప్పుడు?

వరంగల్ జిల్లాలోని 317 గ్రామ పంచాయతీల్లో టీ ఫైబర్ ఇంటర్‌నెట్ కనెక్షన్ల బాక్స్‌లు బిగించారు. బిగించిన పరికరాలు మూలన పడుతున్నాయే తప్ప ఇంకా సేవలు అందుబాటులోకి రావడం లేదు. వీటికి విద్యుత్ సరఫరాలో అవరోధం రాకుండా జీపీ భవనాలపై సోలార్ ప్లేట్లను సైతం అమర్చారు. కానీ, ఇప్పటివరకు అవి నిరుపయోగంగానే మారాయి. కొన్ని గ్రామాల్లో టెస్టింగ్ నడుస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో పూర్తి స్థాయిలో నడవడం లేదు. ఇక టీ ఫైబర్ సేవలను వినియోగించుకునేందుకు ఆయా పంచాయతీలకు కంప్యూటర్లను సైతం అందించారు. వాటిని వినియోగించకపోవడంతో మూలన పడినట్లు చెపుతున్నారు. రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన టీ-ఫైబర్ సేవలు, కంప్యూటర్లు నిరుపయోగంగా ఉండడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి ప్రభుత్వమైనా వాడుకలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

3 నెలలుగా జీతాలు నై..

వరంగల్ జిల్లా వ్యాప్తంగా 38 మంది కంప్యూటర్ ఆపరేటర్లు మాత్రమే పనిచేస్తుండగా, వారికి సక్రమంగా జీతాలు అందడం లేదు. దాదాపు రూ.15000-20000 వరకు జీతం తీసుకుంటున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు వెట్టి చాకిరీ చేయాల్సి వస్తోంది. వర్ధన్నపేట మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా ఇక్కడ ఇద్దరు ఆపరేటర్లు మాత్రమే పనిచేస్తున్నారు. దాదాపు ఒక్కో ఆపరేటర్‌కు 9 గ్రామ పంచాయతీల పనులు చేయిస్తున్నారు. ఓ పక్క అదనపు భారంతో అవస్థలు పడుతుండగా, పనికి తగినంతా వేతనం రాకపోవడం, జీతాలు సక్రమంగా అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఔట్ సోర్సింగ్ విధానంలో 2015లో నాటి ప్రభుత్వం వీరిని రిక్రూట్ చేసుకోగా, ఇప్పటి వరకు పంచాయతీల నుంచే జీతాలు అందిస్తున్నారు. ఉద్యోగ భద్రత సైతం ప్రభుత్వం కల్పించక పోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.


వర్ధన్నపేట మండలంలోని దివిటిపల్లిలో మూలన పడి ఉన్న టీ-ఫైబర్ బాక్సు

ప్రభుత్వానికి నివేదిస్తాం..

కల్పన, జిల్లా పంచాయతీ అధికారి వరంగల్



గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వానికి నివేదిస్తాం. పారదర్శకమైన పాలన అందాలనే లక్ష్యంగా ఈ-పంచాయతీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ప్రజలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో అందేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తే తప్పకుండా ఆ దిశగా చర్యలు తీసుకుంటాం. టీ ఫైబర్ సేవలు, కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.



ప్రజలను అప్రమత్తం చేయాలి

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



గుండ్లవాగు వరదను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలను అప్రమత్తం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. బుధవారం ఆమె పస్రా, తాడ్వాయి మధ్యలో ఉన్న గుండ్లవాగు వరద ఉధృతిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జిల్లా అధికార యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏమైనా వారి సందేహాలను నివృత్తి చేయాలన్నారు. విద్యుత్‌షాక్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, జాలరులు చేపల వేటకు వెళ్లి ప్రమాదాలబారిన పడొద్దని అన్నారు. అదేవిధంగా గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను అధికారులు గుర్తించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ములుగు కలెక్టర్ దివాకర

వెంకటాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలో ఎటువంటి నష్టం వాటిల్లకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర సూచించారు. బుధవారం ఆయన మండలంలో పర్యటించారు. మండలంలోని ఎదిర గ్రామ పంచాయతీ పరిధిలోని యాకన్నగూడెం సమీపంలో గల రాళ్లవాగును సందర్శించారు. రాళ్లవాగు వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడంతో రవాణా స్తంభించిందని అన్నారు. వచ్చే మూడురోజులపాటు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లనున్నాయని, ప్రజలెవరూ బయటకు రావద్దని అన్నారు. గోదావరి వరదముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి మౌలిక సదుపాయాలు కల్పించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా పురాతన భవనాలు, పాత ఇళ్లలో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, అవసరమైన చోట బోటు, రిస్క్ టీంను ఏర్పాటు చేయాలన్నారు. గర్భిణులను స్థానిక ఆస్పత్రికి తరలించాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్‌పౌడర్, దోమలమందు పిచికారీ చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి సంజీవరావు, మండల అధికారులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎడతెరిపిలేలేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. పొంగుతున్న వాగులు, చెరువులు, వాగుల్లోకి వెళ్లొద్దని సూచించారు. వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికార యంత్రాంగం జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నెం 9030632608 ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఉప్పొంగిన వాగులు.. వంకలు



మంగపేట మండలంలో మత్తడి పోస్తునన తిమ్మంపేట పెద్ద చెరువు

వెంకటాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కంకలవాగు, రాచపల్లి వాగులు పొంగిపొర్లాయి. వాగుల్లోకి భారీగా వరదనీరు చేరి ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. మండలంలో మంగళవారం రాత్రి 25.82 సెం.మీ వర్షపాతం నమోదైంది. దీంతో మల్లాపురం, కర్రవానిగుంపు, ఆలుబాక పంచాయతీలోని జిన్నెలవాగు, కలిపాకవాగులు ఉధృ తంగా ప్రవహిస్తుండడంతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలకు వెళ్లే రైతులు సైతం వాగులు దాటుకుంటూ వెళ్లాల్సివచ్చింది. వీఆర్కే పురం పంచాయతీ పరిధిలోని చొక్కాల గ్రామంలో 15ఇళ్లు నీట మునిగినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈవిషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి రాజేం దర్, కాంగ్రెస్ నాయకుడు రవి వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. జేసీబీ సహాయంతో వరద నీటిని కాల్వ ద్వారా బయటకు పంపుతున్నారు. వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో ఎస్సై కొప్పుల తిరుపతిరావ పరిశీలించారు. ఎదిర పంచాయతీలోని యాకన్నగూడెం రాళ్లవాగుపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు కొట్టుకుపోవడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. వాగు వరద ఉధృతిలోకి ఎవరూ వెళ్లకుండా పంచాయతీ సిబ్బందితో బారికేడ్లను ఏర్పాటు చేశారు. అలాగే మండలంలో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా పర్యటించారు.

• వాజేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో అంతర్గత రహదారులు, ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. పంట పొలాలు చెరువులను తలపించాయి. వరద నీరు రహదారులను ముంచెత్తడంతో రాకపో కలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇళ్ల చుట్టూ వర్షపు నీరు చేరడంతో పలు గ్రామా ల ప్రజలు ఇబ్బంది పడ్డారు. జగన్నాథపురం నుంచి వాజేడు మండల కేంద్రానికి వెళ్లే దారిలో మూడు చోట్ల వర్షపు నీరు రెండు అడుగుల మేర ప్రవహించింది. వెంకటాపురం వైపు వెళ్లే రహదారిలో మురుమూరు, అలుగొర్రె వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. పేరూరు, ధర్మవరం, చెరు కూరు, ప్రగళ్లపల్లి, ఏడ్జర్లపల్లి తదితర జీపీలలో వరద పలు ఇళ్లను ముంచెత్త డంతో ముందస్తుగా అధికారులు బాధితులను పునరవాస కేంద్రాలకు తరలిం చారు. మండల వ్యాప్తంగా భారీ వర్షం పడటంతో విద్యుత్ సరఫరాకు అంత రాయం ఏర్పడింది.



మంగపేట మండలం రమణక్కపేటలో నేలమట్టమైన ఇల్లు

• గణపురం (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా వర్షం విస్తారంగా కురిసింది. దీంతో చెరువుల్లో, కుంటల్లో నీరు చేరుతోంది. మండలంలో ఉన్న మాధవరావుపల్లి ఓపెన్‌కాస్టు-3లో వర్షంతో బొగ్గు ఉత్పత్తి స్తంభించింది. ఓబీ పనులు కూడా నిలిచిపోయాయి. బుధవారం ఒక్కరోజే సుమారు 6వేల టన్నుల ఉత్పత్తి నిలిచిపోయి రూ. 2కోట్ల వరకు నష్టం వాటిల్లిందని సింగరేణి అధికారులు తెలిపారు. ఓపెన్‌కాస్టులో నిలిచిన నీటిని అధికారులు మోటార్ల ద్వారా బయటకు పంపిస్తున్నారు.

• టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): గత రాత్రి మండల వ్యాప్తంగా వర్షం భారీగా కురిసింది. దీంతో మండలాన్ని ఆనుకొని ప్రహహించే మానేరు, చలివాగులతో పాటు పలు గ్రామాల్లోని చెరువులు నిండి మత్తడి దుముకుతున్నాయి. గత రాత్రి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో మానేరు, చలివాగులు ఉప్పొంగాయి. దీంతో గర్మిళ్లపల్లి శివారులో మానేరుపై, భూర్నపల్లి శివారులో చలివాగుపై పోసిన తాత్కలిక రోడ్డు తెగిపోయాయి. దీంతో భూపాలపల్లి- పెద్దపల్లి జిల్లాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వెలిశాల, దుబ్యాల గ్రామాలలోని చెరువులు నిండి మత్తడి దుముకుతున్నాయి. సోమన్‌పల్లి గ్రామంలోని పలు ఇండ్లలోని వరద నీరు చేరాయి. సంఘటన స్థలాన్ని స్థానిక మాజీ సర్పంచ్ ఉద్దమారి మహేష్ పరిశీలించారు.

• ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి): గత రాత్రి నుంచి బుధవారం రోజంతా మండలంలో ఎడతెరిపి లేకుండా జోరుగా వాన కురిసింది. మండలంలోని రామన్నగూడెం, రాంనగర్, చిన్నబోయినపల్లి, షాపల్లి, రొయ్యూర్, శంకరాజుపల్లి, శివాపురం, గోగుపల్లి, కొండాయి, చల్పాక తదితర గ్రామాల్లో ఎడతెరిపి లేని వాన పడింది. మండలంలోని దొడ్ల- మల్యాల గ్రామాల మధ్యగల జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మల్యాల, కొండాయి, గోవిందరాజుల కాలనీ, ఐలాపురం గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. అదేవిధంగా మండంలోని బానాజీబంధం- ఎలిశెట్టిపల్లి గ్రామాల మధ్య జంపన్నవాగుకు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఎలిశెట్టిపల్లి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.



వెంకటాపురం మండలంలో వరదనీటితో ఉధృతంగా కంకలవాగు

• మల్హర్ (ఆంధ్రజ్యోతి) :రెండు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల మండలంలోని చెరవులు జలకళను సంతరించుకుంటున్నాయి. మల్లారంలోని ఆరెవాగు, తాడిచర్ల, పీవీనగర్ వద్ద మానేరులో ప్రవాహం మొదలైంది. వర్షం వల్ల వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వర్షం వల్ల పత్తి చేన్లలో నీరు నిలవగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం వల్ల తాడిచర్ల ఓసీపీలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. వర్షం వల్ల మంగళ, బుధవారం రెండు రోజులు బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయినట్లు మైన్ అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో 12 వేల మెట్రిన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, రెండు లక్షల మెట్రిక్ టన్నుల ఓబీ వెలికితీత పనులు నిలిచిపోయినట్లు తెలిపారు

• కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం అర్ధరాత్రి, బుధవారం భారీ వర్షాలు కురిసాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుం టలు జలకళను సంతరించుకున్నాయి. భారీ వర్షంతో జనజీవనం అస్తవ్యస్త మైంది. వాగులు, వంకలు పొంగాయి. భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లోని పత్తి చేలల్లోకి వరద నీరు చేరింది. పల్లపు ప్రాంతాల్లోని ఇళ్ల చుట్టూ వర్షం నీరు నిలిచింది.

• కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకులు, ఒర్రెలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. విద్యుత్ వ్యవస్థ దెబ్బతిని మండలంలోని అన్ని గ్రామాలకు సరఫరా నిలిచిపోయింది. ఐలాపూర్, కంతనపల్లి, బంగారుపల్లి గ్రామాల మధ్యలో వాగులు, ఒర్రెలు పొంగి ప్రవహించాయి. ఏటురునాగారం తుపాలకుగూడెం ప్రధా న రహదారి మధ్యలోని దొంగల గుట్ట ఒర్రె ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్ర యాణికులు ఇబ్బందులు పడ్డారు.

• మంగపేట (ఆంధ్రజ్యోతి) మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు వాన దంచి కొట్టింది. కమలాపురంలో పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. భారీ వర్షం వల్ల లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమై పంట పొలాలు నీట మునిగిపోయాయి. మంగపేట - కమలాపురం మార్గంలో బూర్గంపహాడ్- ఏటూరునాగారం ప్రధాన రహదారి బీసీ హాస్టల్ పక్కన వరద ప్రవాహంతో కల్వర్టు కోతకు గురైంది. ప్రధాన రహదారిపై రైతు వేదిక భవనం చుట్టూ వరద నీరు చేరింది. తహసీల్దార్, ఎంపీడీవో భవనాల ముందు రోడ్లపై నుంచి వర్షపు నీరు చేరింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ నీరు చేరింది. గంపోనిగూడెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే కాలనీలో జనవాసాలలోకి వర్షపు నీరు చేరింది. మంగపేట- బోరునర్సాపురం వెళ్లే రింగ్ రోడ్డు కొత్త బ్రిడ్జీవద్ద రహదారి పక్కన పెద్ద బుంగ పడి ప్రమాద భరితంగా మారింది. కమలాపురంలోని ఎర్రవాగు, మంగపేటలోని గౌరారం వాగు, మల్లూరులోని ఊరవాగు, మల్లూరు మొట్లగూడెం, శనిగకుంట మధ్యలోని మల్లూరు వాగు, చుంచుపల్లివద్ద ఊరవాగు, రాజుపేట వద్ద ముసలమ్మవాగులు వరద నీటితో పొంగిపొర్లాయి.

• తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు మండలం మేడారం జంపన్న వాగులో వరద ఉధృతి పెరిగింది. దీంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. బంధాల గ్రామ పంచాయితీ పరిధిలోని అల్లిగూడెం నర్సాపూర్ పీఎల్ గ్రామం నుంచి పోచాపూర్ కంటైనర్ ప్రభుత్వ ఆస్పత్రికి పురిటినొప్పులతో ఇబ్బంది పడుతున్న గుమ్మడి కృష్ణవేణి అనే మహిళను తరలించేందుకు స్థానిక ప్రజలు, బంధువులు ప్రయత్నిస్తున్న క్రమంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వట్టివాగు వల్ల అంతరాయం ఏర్పడింది. దీంతో వరదను దాటుతూ మహిళను ఆస్పత్రికి తరలించారు.

పెరుగుతున్న గోదావరి ప్రవాహం

మహదేవపూర్/ములుగు, జూలై 23(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి నది క్రమంగా పెరుగుతూ వస్తోంది. కొద్ది రోజులుగా తగ్గుతూ వచ్చిన గోదావరి నది కాళేశ్వరం సహా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ప్రవాహం ఉధృతమవుతోంది. బుధవారం సాయంత్రం కాళేశ్వరం వద్ద గోదావరి 6మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. అలాగే ములుగు జిల్లా కాన్నాయిగూడెం, మంగపేట, ఏటూరునాగారం, వాజేడు మండలాల్లో గోదావరి స్వల్పంగా పెరిగింది.

సింగరేణికి రూ.3 కోట్ల నష్టం

కృష్ణకాలనీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం కారణంగా సింగరేణికి నష్టం వాటిల్లింది. భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్‌కాస్టుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. రోజుకు 10వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా 4 వేల టన్నులు మాత్రమే వెలికితీసినట్టు అధికారులు తెలిపారు. వర్షం కారణంగా సంస్థకు బుధవారం రూ. 3 కోట్ల నష్టం వాటిల్లిందని వివరించారు.

బ్యారేజీల్లోకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్/కన్నాయిగూడెం, జూలై 23(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి, ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని సమ్మక్క బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం మేడిగడ్డ బ్యారేజీలోకి 98,440క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 2.10మీటర్ల ఎత్తులో గోదావరి నది ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే సమ్మక్క బ్యారేజీలోకి ప్రస్తుతం 1, 24,110 కూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ఏడు గేట్లు తెరచి 1,33,654 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

వెంకటాపురం మండలంలో అత్యధికంగా 23.1 సె.మీ వర్షపాతం

ములుగు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వెంకటాపురం మండలంలో బుధవారం ఉదయం 8.30 నుంచి రాత్రి 9 గంటల వరకు అత్యధికంగా 23.1 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం 8.30గంటల నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల వరకు 25.8 నమోదైందని పేర్కొన్నారు. ఇది రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతమని తెలిపారు. బుధవారం ఉదయం 8.30 నుంచి రాత్రి 9 గంటల వరకు మంగపేట మండలంలో 11.95 సెం.మీ., ఏటూరునాగారం మండలంలో 10.53 సెం.మీ., వాజేడు 8.53 సెం.మీ., తాడ్వాయి 6.65 సెం.మీ., జేడీ మల్లంపల్లి మండలంలో 5.7 సెం.మీ గోవిందరావుపేట మండలంలో 3.05 సెం.మీ., వెంకటాపూర్ మండలంలో 1.75 సెం.మీ., ములుగు మండలంలో 1.05 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేటలో 2023 జూలై 27న రికార్డు స్థాయిలో 64.98 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షపాతం రాష్ట్రంలోనే అత్యధికంగా నమోదు కావడం గమనార్హం. మళ్లీ తాజాగా అదే మండలంలో వరుసగా 25.8, 23.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

భూపాలపల్లి జిల్లాలో సగటు వర్షపాతం 5.07 సెం.మీ

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8గంటల వరకు 5.07 సగటు వర్షపాతం నమోదైనట్టు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యధికంగా టేకుమట్ల మండలంలో 9.82 సెం.మీ వర్షం కురవగా, అత్యల్పంగా పలిమెల మండలంలో 1.28 సెం.మీ కురిసింది. మహదేవపూర్ మండలంలో 3.64, పలిమెల 3.26, మహాముత్తారం 1.28, కాటారం 5.38, మల్హర్ 3.16, చిట్యాల 7.48, టేకుమట్ల 9.82, మొగుళ్లపల్లి 9.76, రేగొండ 2.24, గణపురం 6.62, భూపాలపల్లి మండల వ్యాప్తంగా 3.22 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఏఎస్పీ

ఏటూరునాగారం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. మండల కేంద్రంలోని ఏఎస్పీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాబోయే మూడు రోజులు ఈనెల 26 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్స్యకారులు ఎవరూ గోదావరి నదిలోకి, జంపన్న వాగులోకి చేపలు పట్టడానికి వెళ్లొద్దని సూచించారు. సామాన్య ప్రజానీకం కూడా గోదావరి వెంబడి ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పిడుగుపాటు గుర్రై యువకుడి మృతి

(5వ పేజీ తరువాయి)

పేరూరుకు చెందిన తోటపల్లి వేణు (20) బుధవారం మధ్యాహ్నం ఏటూరునాగారం ఉన్న తమ్ముడి దగ్గరికి బైక్‌పై భారీ వర్షంలో బయల్దేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో పెద్దగొల్లగూడెం-చీకుపల్లి వద్ద వేణుపై పిడుగు పడింది. దీంతో అతడు బైక్ పైనుంచి కిందపడిపోయి ప్రాణాలు వదిలాడు. భారీ వర్షం కావడంతో ఎవరూ గమనించలేదు. ఈ క్రమంలో అటువైపు వెళ్తున్న ప్రయాణికులు స్థానికులకు సమాచారం ఇచ్చారు. వేణును వాజేడు ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.. మృతదేహాన్ని వాజేడు ఎస్సై పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు. వేణు తల్లిదండ్రుల ఎల్లయ్య, సమ్మక్కలకు ఇద్దరు కుమారులు కాగా వేణు పెద్దవాడు. డ్రిగ్రీ మొదటి సంవత్సరంలో ఇటీవలే ప్రవేశించాడు. చేతికి అందిన కొడుకు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

మెడికల్ కాలేజీ సమస్యలు పరిష్కరించాలి

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



వైద్య విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 23(ఆంధ్రజ్యోతి): తమ హయాంలో జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, ఆయుష్ ఆస్పత్రి, జీజీహెచ్‌లను ఆయన బుధవారం సందర్శించారు. మెడికల్ కాలేజీలో ఉన్న అధ్యాపకుల కొరతను వెంటనే భర్తీ చేయాలన్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా హాస్టల్ బిల్డింగ్, కాలేజీ భవనాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. జీజీహెచ్‌లో అపరిశుభ్రం కారణంగా రోగులు ఇబ్బందులు పడుతు న్నారన్నారు. రోగులకు మెనూ ప్రకారం భోజనం అందించడంలేదని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆస్పత్రిలో సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్‌లతో పాటు పిల్లల వార్డులో వెంటిలేటర్స్ సౌకర్యం కల్పించాలన్నారు.

కాళేశ్వరంలో బీజాపూర్ ఎమ్మెల్యే పూజలు

మహదేవపూర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో బీజాపూర్ ఎమ్మెల్యే విక్రమ్ మండవి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. స్వామి వారి శేష వస్త్రాలతో సన్మానించారు.

భూపాలపల్లి కలెక్టర్ తనిఖీ

రేగొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎంజేపీ గురుకుల పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు ఆయన వెంట వైద్యాధికారి హిబిందు, సిబ్బంది ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ

మహాముత్తారం, జూలై23(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌ను బుధవారం సాయంత్రం కాటారం డీఎస్పీ సూర్యనా రాయణ సందర్శించారు. ఠాణాలోని రికార్డులను తనిఖీ చేశారు. ఎస్సై మహేంద్రకుమార్ పోలీసులతో సమావేశమై మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా మండలంలో అపరిచిత వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు.

విచారణ అయిపాయే.. నివేదిక ఏమాయే..?!

(5వ పేజీ తరువాయి)

విచారణకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. మే 21న కేయూ వైస్ చాన్స్‌ల ర్‌గా రమేశ్ పదవీ విరమణ చేయనుండగా, ప్రభు త్వం మే 18వ తేదీనే రమేష్‌పై కేయూలో జరిగిన పలు అక్రమాలు, అవినీతి ఆరోపణలపై విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేయటం అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేగింది. విజిలెన్స్ అధికా రులు సైతం రంగంలోకి దిగారు. మాజీ వీసీపై వచ్చిన ఆరోపణలపై క్షుణ్ణంగా పరిశీలన చేశారు. కేయూ భూముల అక్రమణలతో పాటు వివిధ ఆరోప ణలపై విచారణ చేసిన విజిలెన్స్ అధికారులు.. నివేది కలను ప్రభుత్వానికి పంపించి నట్లు సమాచారం. అయితే ఏడాది గడిచినప్పటికీ ఇప్పటి వరకు విజిలెన్స్ విచారణలో ఏం తేలిందో.. మాజీ వీసీపై వచ్చిన ఆరోపణలు వాస్తవమా..? కాదా..? అనేది చర్చనీయాంశంగా మారింది. వాస్తవ మైతే చర్యలు ఎందుకు తీసుకోవటం లేదని.. కాక పోతే పదవిలో ఉన్న మూడేళ్లు అనవసరమైన ఆరోప ణలతో రమేష్‌ను మానసికంగా ఇబ్బందికి గురి చేశారా..? అనేది కూడా తెలుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. విచారణ పూర్తయినప్పటికీ చర్యలకు తాత్సారం వెనుక ఉన్న మతలబు ఏమిటనేది చర్చనీయాంశంగా మారింది.

జాడలేని నివేదికలు

మాజీ వీసీ వెంకటరత్నంపై కూడా విజిలెన్స్ విచారణ చేపట్టింది. 2013-15లో కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా పని చేసిన వెంకటరత్నంపై ప్రభుత్వం 2024 ఆగస్టు 12 విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేయటం అప్పట్లో కేయూలో కలకలం రేగింది. ఆగస్టు 16వ తేదీన వరంగల్ విజిలెన్స్ అధికారులు మాజీ వీసీ వెంకటరత్నంను విచారిం చారు. 2013లో ప్రొఫెసర్ వెంకటరత్నం ప్రభుత్వం అనుమతి లేకుండా కాకతీయ యూనివర్సిటీలో కనీస కాలపరిమితి కలిగిన ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయటంపై విచారణ జరిగింది. పదేళ్ల కిందట రెగ్యులరైజ్ చేసిన సంఘటనకు సంబంధించి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేయటం అప్పట్లో కేయూలో కలకలం సృష్టించింది. దీనికి సంబంధించిన విచారణ పూర్తయినప్పటికీ విజిలెన్స్ అధికారులు ఎలాంటి నివేదికలు ప్రభుత్వానికి ఇచ్చారనే చర్చ జరుగుతోంది. అలాగే మరోవైపు కేయూ మాజీ రిజిస్ట్రార్ మల్లారెడ్డిపై ప్రభుత్వం విచారణకు ఆదేశాలు జారీ చేసింది. హనుమకొండకు చెందిన కేఎస్ రెడ్డి అనే వ్యక్తి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, ఉన్నత విద్యాశాఖ అధికారికి ప్రొఫెసర్ మల్లారెడ్డి నియామకంపై ఫిర్యాదులు వెళ్లాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అనుభవం, అర్హతలు లేకుండానే అసోసియేట్ ప్రొఫెసర్‌గా కేయూ నియమించిందని, అప్పటి అధికారులు నిబంధనలను ఉల్లంఘించి పదోన్నతి కల్పించారని ఆరోపించారు. రిజిస్ట్రార్‌గా మల్లారెడ్డికి ఎలాంటి టీచింగ్ అనుభవం, అర్హతలు లేవని, దీనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కేఎస్ రెడ్డి ఆ ఫిర్యాదులో కోరారు. దీనిపై విచారణ చేపట్టాలని ప్రభుత్వం కేయూ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌కు ఉత్తర్వులు (నెం.1457/ యూఈ/ఏ2/ 2024 జారీ చేసింది. దీనిపై అప్పటి ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ విచారణ చేపట్టకుం డానే రాజకీయ ఒత్తిళ్లతో తప్పుదారి పట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మల్లారెడ్డి వీసీ రేసులో ఉండటంతో తనపై తప్పుడు ఫిర్యాదులు చేశారని ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ నేత ద్వారా అప్పటి ఇన్‌చార్జి వీసీపై ఒత్తిడి తీసుకురావటంతో ఆ విచారణ సైతం అటకెక్కిందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి.

పాలకమండలి, వీసీ దృష్టి సారించాలి..

కాకతీయ యూనివర్సిటీలో జరిగిన అక్రమాలు, అవినీతి తదితర వాటిపై కొత్తగా కొలువుతీరిన పాలక మండలితో పాటు నూతన వైస్‌చాన్స్‌లర్ దృష్టి పెట్టాలని విద్యార్థులు, ఆధ్యాపకులు కోరుతున్నారు. ప్రధానంగా కేయూ భూముల కబ్జాలపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. అక్రమార్కులకు అవకాశం ఇవ్వకుండా కఠినంగా వ్యవహరించాలని విద్యార్థులు కోరుతు న్నారు. వీటితోపాటు ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఫీజుల పేరుతో సుమారు రూ.5కోట్లు స్వాహా చేసిన ట్లుగా ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ద్విసభ్య కమిటీ వేసి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నా యి. పూర్తిస్థాయి విచారణ చేపట్టి వాస్తవాలు వెలుగు లోకి తీసుకరావాల్సిన అవసరం ఉందనే అభిప్రా యాలు వ్యక్తం అవుతున్నాయి. మెస్ బిల్లుల పేరుతో యూనివర్సిటీలో రూ.2.50కోట్ల స్కామ్ జరిగినట్లుగా ప్రచారం జరిగింది. దీనిపై ఫిర్యాదులు వచ్చినా గత వీసీ పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. అసోసి యేట్ ప్రొఫెసర్ల, సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి.

బీఆర్‌ఎస్ పెండింగ్ పనులు

పూర్తి చేస్తున్నాం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పెండింగ్‌లో పెట్టిన పనులు పూర్తి చేసి చూపిస్తున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాటా ్లడారు. నాడు పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హామీలు ఇచ్చి నెరవేర్చని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తోందని అన్నారు. ఈ క్రమంలోనే కోట్లాది రూపాయల నిధులు తీసుకొస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఆరోపించినట్లు పాఠశాల ఆవరణలో పోలీస్‌స్టేషన్ పెట్టడం తాత్కలికమేనని, దానికి పర్మనెంటు పరిష్కారం ఆలోచించామని స్పష్టం చేశారు. కానీ ఇదే ఆరోపించిన వ్యక్తి గతంలో పాఠశాల ఆవరణలో తహసీల్దార్ కార్యాలయం ఎలా ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే గాంధీనగర్ గుట్టపై రూ.200కోట్లతో ఇండస్ట్రీయల్ పార్కు, ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు. రూ.4కోట్లు రోడ్ల కోసం వెచ్చించి అభివృద్ధి పనులు ప్రారం భించారు. కాశీంపల్లి నుంచి జంగేడు, భూపాలపల్లి నుంచి సుభాష్‌కాలనీకి రోడ్లు ప్రారంభించారు. ఈ సమావే శంలో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, నాయకులు దాట్ల శ్రీనివాస్, పిప్పాల రాజేందర్, తోట రంజిత్, మహేందర్, ముంజాల రవీందర్ పాల్గొన్నారు.

ప్రజల కోసమే పల్లె దవాఖానాలు

రేగొండ (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలో రూ.20లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానాను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు ఏనుగు రవిందర్‌రెడ్డి, ఎడ్ల మల్లారెడ్డి, పున్నం రవి, మైస భిక్షపతి, పట్టెం కిరణ్, కొలెపాక సాంబయ్య పాల్గొన్నారు.

పిడుగుపాటు గుర్రై యువకుడి మృతి

(5వ పేజీ తరువాయి)

పేరూరుకు చెందిన తోటపల్లి వేణు (20) బుధవారం ఏటూరునాగారం ఉన్న తమ్ముడి దగ్గరికి బైక్‌పై భారీ వర్షంలో బయల్దేరాడు. మార్గమధ్యలో పిడుగు పడి మృతి చెందాడు. మృతదేహాన్ని వాజేడు ఎస్సై పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...
దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !
పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.
సంప్రదించగలరు : జయశంకర్
Jayashankar Aco - 9985426984,
Bhupalpally SR - 8008795764
Mulugu SR - 9849245045, Eturunagaram
SR - 7673960447 ACM - 9985411664